మోటార్లు మునిగే.. భగీరథ రాకపాయే..

● కౌడిపల్లిలో తాగునీటి కోసం తండ్లాట
● పది రోజులుగా జనం అవస్థలు


చెరువులో స్టాటర్‌బాక్స్‌లు

కౌడిపల్లి(నర్సాపూర్): మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో నీటి సమస్య ఉత్పన్నమైంది. దీంతో స్థానికులు పది రోజులుగా తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న రెండు బోర్లు, మోటార్లు చెరువు నీటిలో మునిగి పోవడంతో కౌడిపల్లిలో ఈ కష్టాలు మొదలయ్యాయి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువు కుంటలు అలుగు పారుతున్నాయి. ఈ దశలో మిషన్ భగీరథ పథకం సాంకేతిక సమస్య తలెత్తింది. మరమ్మతుకు నోచుకోక పది రోజులుగా గ్రామాలకు మంచినీరు సరఫరా కావడం లేదు. ఇదిలా ఉండగా కౌడిపల్లి గ్రామానికి తాగునీటిని సరఫరా చేసేందుకు నాలుగు ట్యాంక్‌లు, ఒక పెద్ద సంపు ఉంది. భగీరథ నీళ్లు రాని సమయంలో స్థానిక పెద్దచెరువులో ఉన్న రెండు బోర్లు పైప్‌లైన్ ద్వారా సంపును నింపి అక్కడి నుంచి ట్యాంక్‌లు, నల్లాల ద్వారా నీళ్లు సరఫరా చేసేవారు. వర్షాలతో పెద్దచెరువు నిండటంతో చెరువులో ఉన్న రెండు బోర్లు మోటార్లు మునిగిపోయాయి. దీంతో వాటిని నడిపించలేని పరిస్థితి నెలకొంది. ఇటు మిషన్ భగీరథ రాక, అటు ఉన్న బోరు బావులు చెరువు నీటిలో మునిగిపోవడంతో నీటి సమస్య తప్పడంలేదు.

ముందు చూపులేకపోవడమే కారణమా..!

గ్రామంలో పలుచోట్ల బోరుబావులు వేసినప్పటికి ఫెయిల్ అవడంతో శాశ్వతంగా సమస్య పరిష్కారం కోసం గత ప్రభుత్వం రూ 2.55 కోట్లతో చెరువులో రెండు బోర్లు వేసింది. పైప్‌లైన్ ద్వారా పీహెచ్‌సీ గ్రౌండ్‌లో నిర్మించిన పెద్ద సంపును నింపి నీటిని సరఫరా చేస్తుంది. వర్షాలతో చెరువు నిండినప్పుడు బోర్లు మునిగి పోకుండా ఉండేందుకుగాను గద్దెలను నిర్మించలేదు. ముందుచూపు లేకపోవడంతో నేడు ఈ సమస్యకు కారణమైందని పలువురు గ్రామస్తులు విమర్శిస్తున్నారు. బోరు బావుల చుట్టూ గద్దెలు నిర్మించి ఉంటే బోర్లు యథావిధిగా నడిచేవని, దీంతో నీటి సమస్య తలెత్తిది కాదని చెబుతున్నారు. ఇకనైనా నీటి సమస్య తలెత్తకుండా అధికారులు శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి వెంకటేశంకు వివరణ కోరగా.. చెరువు నిండటంతో రెండు బోర్లు నీటిలో మునిగి పోయాయని, నీటి సమస్య తీర్చేందుకు సింగిల్ ఫేజ్ మోటార్లు, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.


కౌడిపల్లిలో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

తాగునీటికి కటకట

'భగీరథ' నిలిచిపోవడంతో అవస్థలు

శివ్వంపేట(నర్సాపూర్): పది రోజుల నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి కోసం ప్రజలు తంటాలు పడుతున్నారు. వరదల మూలంగా మంజీరా ప్రధాన పైప్‌లైన్ దెబ్బతినడంతో గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. తాగునీటి అవసరాల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు.. పట్టించుకోకపోవడంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. తాగునీటి కోసం సమీపంలోని వ్యవసాయ బోరుబావులను ఆశ్రయించాల్సి వస్తుంది. అధికారులు స్పందించి గ్రామాల్లో నెలకొన్న తాగునీటి ఇబ్బందులు పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నర్సాపూర్ నియోజకవర్గానికి గోదావరి జలాలు తరలించేందుకు సిద్దిపేట జిల్లా కోమటిబండ నుంచి ఏర్పాటు చేసిన పైప్‌లైన్, శివ్వంపేటలో నిర్మించిన 8 లక్షల లీటర్ల సంపు వృథాగా ఉంది. దాన్ని వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి.


చండీ గ్రామంలో బోరుబావి నుంచి తాగు నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

తొగిట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని తొగిట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయ ఆవరణలో 15వ వార్షిక ఆరాధన కార్యక్రమంలో, నాచారం పీఠాధిపతి మధుసూదనానంద సరస్వతితో కలిసి పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రవచనాలు అందించారు. కార్యక్రమంలో నరహరిశర్మ, దిగంబరశర్మ, గుడి చంద్రశేఖరశర్మ, సాయి, రాఘవేంద్రాచారి, గుడి సంతోష్‌శర్మ, ఆంజనేయశర్మ, పూజారి సంగప్ప పాల్గొన్నారు.


కొప్పోల్‌లో సహజానంద సరస్వతి ఆరాధన కార్యక్రమం

ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

నర్సాపూర్: మండలంలోని అచ్చంపేట యూపీఎస్ ప్రధానోపాధ్యాయుడు, దివంగత లక్ష్మినారాయణ కుటుంబానికి పీఆర్టీయూ అండగా ఉంటుందని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన లక్ష్మినారాయణ కుటుంబానికి గురువారం పలువురు సంఘం ప్రతినిధులతో కలసి ఆయన పరామర్శించారు. రూ. లక్ష చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం తమ సంఘం కృషి చేస్తుందన్నారు. సభ్యత్వం పొందిన ఉపాధ్యాయులకు సంఘం తరపున ఆర్థిక చేయూత అందిస్తామన్నారు. ఆయన వెంట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, సామ్యానాయక్, ఎంఈఓలు తారాసింగ్, బుచ్చానాయక్‌లతో పాటు యూనియన్ నాయకులు స్వరూపరాణి, మల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి, వీరేశం, భీమ్లా, వీరేశం, అనిల్‌రెడ్డి, రాఘవేందర్ తదితరులు ఉన్నారు. లక్ష్మినారాయణ సంతాపసభలో ఆర్డీఓ మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్లు మురళీయాదవ్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, పీఆర్టీయూ ప్రతినిధులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంతోపాటు కల్వకుంట, రజాక్‌పల్లి సొసైటీ ఆధ్వర్యంలో గురువారం వరి కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈఓ శోభ, గోపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలన్నారు. ప్రభుత్వం ఏగ్రేడ్ రకానికి క్వింటాకు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 చెల్లిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు మౌనిక, రమ్య, రైతులు బాబు, కుమార్, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్, ధర్మాసాగర్, కౌడిపల్లి, వెల్మకన్న గ్రామాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో గురువారం అధికారులు వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏఓ స్వప్న, సొసైటీ సీఈఓ దుర్గాగౌడ్, సుధాకర్, విష్ణు, అనీల్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశం, నరహరి, ప్రవీణ్‌రెడ్డి, ఆర్ఐ శ్రీహరి, నిర్వాహకులు పాల్గొన్నారు.

సోమక్కపేటలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సహదేవ్ అన్నారు. గురువారం పీఏసీఎస్ సిబ్బందితో కలిసి మండల పరిధిలోని సోమక్కపేటలో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మి మద్దతు ధర లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ పోచయ్య, సిబ్బంది నర్సింలు, రాజు, రైతులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం పెంటాగౌడ్ అన్నారు. గురువారం మండల పరిధి ఎదులాపూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీసీలు నర్సింలు, భాస్కర్, తదితరులు ఉన్నారు.

చేగుంటలో..

చేగుంట(తూప్రాన్): ఐకేపీ ఆధ్వర్యంలో గురువారం చేగుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ శివప్రసాద్ ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఏపీఎం దుర్గా ప్రసాద్ ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు. చేగుంట సహకార సంఘం ఆధ్వర్యంలో అనంతసాగర్‌లో సీఈఓ సందీప్ కొనుగోలు కేంద్రం ప్రారంభించారు.

సూరారంలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారంలో ఐకేపీ సీసీ యశోధ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ వీఓఏలు నాగరాజు, మహిళ సమైక్యా సంఘం సభ్యులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న సొసైటీ సభ్యులు


సోమక్కపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన తహసీల్దార్ సహదేవ్


కౌడిపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డిపై కబ్జా కేసు

శివ్వంపేట(నర్సాపూర్): కుంట శిఖం భూమి కబ్జాకు పాల్పడిన శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డిపై ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల పరిధి కొంతన్‌పల్లిలోని కరీంకుంట శిఖం భూమిలోకి అక్రమంగా ప్రవేశించి రోడ్లు, పలు కట్టడాలు చేసిన వారికి రెండు సార్లు నోటీసులు జారీ చేసినప్పటికి ఎలాంటి స్పందన లేదని ఇరిగేషన్ ఏఈ సునీత తెలిపారు. కుంట భూమి అన్యాక్రాంతం కావడంతో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల ఆధ్వర్యంలో జాయింట్ సర్వే చేసి కబ్జా భూమిని స్వాధీనం చేసుకుని హద్దులు ఏర్పాటు చేశామన్నారు. కబ్జాకు పాల్పడిన వారికి నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందన లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు డీఈ బుచ్చిబాబు తెలిపారు. దీంతో వెంకట్‌రామిరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

నాకు సంబంధం లేదు

కరీంకుంట శిఖం భూమి ఆక్రమణలో తనకు ఎలాంటి సంబంధం లేదని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి అన్నారు. గతంలో తనకు సంబంధించిన పట్టా భూమి ఇతరులకు విక్రయించానని, శిఖం భూమిని తాను ఆక్రమించలేదని స్పష్టం చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం

మనోహరాబాద్(తూప్రాన్): వర్షాలకు రోడ్డు కుంగిపోవడమే కాకుండా మధ్యలో భారీ గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులకు ప్రమాదాలు తప్పడం లేదు. మండలంలోని దండుపల్లి- వర్గల్ రహదారిలో దండుపల్లి శివారులో రోడ్డు భారీగా కుంగడమే కాకుండా, పెద్ద గుంత ఏర్పడింది. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగితే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు దృష్టి సారించి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


దండుపల్లి-వర్గల్ రోడ్డు మధ్యలో కుంగిన రోడ్డుపై కొమ్మలుంచిన దృశ్యం

ప్రభుత్వ పథకాలపై కళాజాత

దుబ్బాకటౌన్: ప్రభుత్వ పథకాలు, ఆన్‌లైన్ మోసాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం అవగాహన కల్పించింది. గురువారం రాయపోల్ మండలం వడ్డేపల్లిలో ఓటుహక్కు వినియోగం, పచ్చదనం, పరిసరాల పరిశుభ్రత, ట్రాఫిక్ నియమాలు, డ్రగ్స్ గురించి ఆట, పాటలతో వివరించారు. ఈ సందర్భంగా టీమ్ లీడర్ ఆస రామారావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకునే జాగ్రత్తలు, ప్లాస్టిక్ నిషేధం, హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించామన్నారు. కార్యక్రమంలో కళాకారులు చీకోడు నర్సింహులు, బిట్ల ఎల్లం, తుమ్మల ఎల్లం, శేఖర్ తదితరులున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

జగదేవ్‌పూర్(గజ్వేల్): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డిని పీఆర్టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్‌శర్మ మాట్లాడుతూ ఉత్తమ విద్యాబోధన అందించారన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాయక్, ప్రభాకర్, నర్సింహారెడ్డి, జ్యోతి, నరేందర్, సంధ్య, రామకృష్టారెడ్డి పాల్గొన్నారు.



వెంకట్రామిరెడ్డిని సన్మానిస్తున్న పీఆర్టీయూ నేతలు

వరిలో సుడిదోమ కంకి నల్లి ఉధృతి

ఏఈఓ రాజశేఖర్ రెడ్డి

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేట గ్రామ శివారులో వరి పంట పొలాలను గురువారం ఏఈఓ రాజశేఖర్ రెడ్డి పరిశీలించారు. వరిలో సుడి దోమ, కంకి నల్లి ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. నివారణ కోసం రైతులు వెంటనే పొలాల్లో తూర్పు, పడమర పాదులు తీసుకోవాలని, నివారణకు మెట్రోజన్ 120 గ్రాములు, వేప నూనె 5మి.లీ.మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కంకినల్లితో గింజలు రంగు మారడం వంటివి గమనిస్తే స్పైరోమెసిఫిన్ 250 మి.లీ.లు, ప్రోపీ కొనజోల్ 200 మి.లీ ఎకరాకు కలిపి పిచికారీ చేయాలన్నారు. తద్వారా పురుగులను, తెగులను అదుపులో ఉంచుకోవచ్చని రైతులకు అవగాహన కల్పించారు.


రైతులకు సూచనలు చేస్తున్న ఏఈఓ

ఐకేపీ సెంటర్ కోసం స్థలం చూపాలి

తహసీల్దార్‌కు రాయిలాపూర్ గ్రామస్తుల వినతి


తహసీల్దార్ రజనీకి వినతిపత్రం అందజేస్తున్న రాయిలాపూర్ గ్రామస్తులు

రామాయంపేట(మెదక్): ధాన్యం ఆరబోత, ఐకేపీ సెంటర్ ఏర్పాటు కోసం తగిన స్థలం చూపాలని రాయిలాపూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రామాయంపేటలో తహసీల్దార్ రజనీకి వినతిపత్రం అందజేశారు. చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. సరైన స్థలం లేకపోవడంతో ప్రతి ఏటా కొనుగోలు కేంద్రం నిర్వహణ, ధాన్యం ఆరబోతకు ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. ప్రభుత్వ స్థలంలో ఐకేపీ సెంటర్ ఏర్పాటు చేయాలని, ధాన్యం ఆరబోతకు స్థలం కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. సదరు స్థలంలో మందిరం నిర్మించుకోవడానికిగాను కొందరు కుట్రలు పన్నుతున్నారని వారు ఆరోపించారు.

వర్షమొస్తే అంతే!


అలుగు నుంచి రాకపోకలు సాగిస్తున్న ఎస్సీ కాలనీవాసులు

ఎస్సీ కాలనీకి అడ్డంకిగా మారిన ఊర్లకుంట అలుగు

● అలుగు పారితే రాకపోకలకు ఇబ్బందులు
● హై లెవెల్ కాజ్‌వే నిర్మాణానికి ఆసక్తిచూపని అధికారులు
● ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు

కొల్చారం(నర్సాపూర్): వర్షాకాలంలో వానలు పడితే ఎక్కడైనా రైతులు సంతోషం వ్యక్తం చేయడం సహజమే. అయితే ఆ గ్రామంలో వర్షం వస్తే చాలు భయాందోళనకు గురవుతారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ వద్ద ప్రతి ఏటా వర్షాకాలంలో అలుగు పారడంతో రాకపోకలు నిలిచిపోతుంటాయి. ఈ కాలనీవాసులకు ఊర్లకుంట అలుగు అడ్డంకిగా మారింది. వర్షాలు కురిసిన సమయంలో అలుగు పారి కాలనీకి, గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాపోతున్నారు. ఈ సమస్యను తొలగించేందుకు హై లెవెల్ కాజ్‌వే చేపట్టాలని కాలనీవాసులు మొర పెట్టుకుంటున్నా వినేవారే కరువయ్యారు.

పాఠశాలకు వెళ్లేందుకు తప్పని తిప్పలు

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీని గ్రామానికి అర కిలోమీటర్ దూరంలో ప్రత్యేకంగా నిర్మించారు. గ్రామానికి, కాలనీకి మధ్య ఊర్లకుంట సరిహద్దుగా ఉంది. కాలనీవాసులకు ఏ అవసరం వచ్చినా రాత్రి పగలు అంటూ తేడా లేకుండా అలుగు నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. అయితే వర్షాకాలం వచ్చిందంటే గ్రామానికి, కాలనీకి మధ్య ఉన్న ఊర్లకుంట అలుగు పారుతోంది. ఈ సమయంలో అలుగు దాటేందుకు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు జంకుతున్నారు. రాత్రి సమయాల్లో విషపురుగుల ప్రభావంతో బిక్కుబిక్కుమంటూ అలుగుపై పారుతున్న నీటి నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఒక్కోసారి ఈ మార్గంలో వీధిదీపాలు సైతం వెలడం లేదు. దీంతో చీకట్లోనే రాకపోకలు కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది వర్షాకాలంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఒకవైపు ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ సమస్య తీరడం లేదు. మరోవైపు నాయకులు పరిశీలించిన నిర్మాణంపై మాట్లాడడం లేదు. అధికారులు స్పందించి ఇబ్బందులు తీర్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ డీఎస్పీ విచారణ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పాంబండ గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించి తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులను విచారించారు. ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి నడుచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ మధుకర్‌రెడ్డి ఉన్నారు.

◆ మాజీ కౌన్సిలర్ మృతి

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ అయితారం నర్సింలు బుధవారం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి గురువారం మెదక్‌లో జరిగిన నర్సింలు అంత్యక్రియలో పాల్గొన్నారు. అంతకుముందు నర్సింలు మృతదేహంపై పూలు వేసి నివాళులు అర్పించారు. ఆమె వెంట మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున గౌడ్, నాయకులు సాయిలు, రాజు, నర్సింలు, మధు, కిరణ్, భువన్ తదితరులు ఉన్నారు.

◆ బీజేపీ గెలుపే లక్ష్యం

కోహెడ(హుస్నాబాద్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు ముందుకు సాగాలని ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఖమ్మం వెంకటేశం పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై గురువారం సమావేశం నిర్వహించారు. 27 సర్పంచ్, 13 ఎంపీటీసీలతోపాటు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు కైవసం చేసుకోవాలన్నారు. అభ్యర్థుల పేర్లను జిల్లా కమిటీకి పంపినట్లు చెప్పారు. కార్యక్రమంలో జాలిగం రమేశ్, రజనీకాంత్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్నికల నామినేషన్ పరిశీలన


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలన అధికారులు

నిజాంపేట(మెదక్): స్థానిక ఎన్నికల నేపథ్యంలో గురువారం ఎన్నికల పరిశీలన అధికారి ఆసం వెంకటేశ్వర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ నగేష్‌లు మండల కేంద్రంలోని నామినేషన్ కార్యాలయం, ఎన్నికల పోలింగ్ బూత్‌లను సందర్శించారు. స్థానిక ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరగాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికల అధికారులకు అన్ని వసతులు కల్పించాలన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

టేక్మాల్(మెదక్): రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేసిందని ఆరోపిస్తూ గురువారం టేక్మాల్‌లో బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే వరకు బీఆర్‌ఎస్ పక్షాన ఉద్యమిస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వీరప్ప, నాయకులు భాస్కర్, సిద్దయ్య, గోవింద్‌చారి, మల్లేశం, సలీం, రమేష్‌నాయక్, సురేష్ పాల్గొన్నారు.

43 రోజులుగా అలుగు


అలుగు పారుతున్న సదాశివపల్లి కనికల చెరువు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని సదాశివపల్లి కనికల చెరువు గత 43 రోజులుగా అలుగు పారుతోంది. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి నిరాటంకంగా అలుగు పారుతోంది. ఈ సీజన్‌లో సాధారణ వర్షపాతం కన్నా.. వర్షాలు పుష్కలంగా కురడంతో ఇన్ని రోజుల పాటు అలుగు పారుతోంది. దీంతోపాటు మండలంలోని పలు చెరువు, కుంటలు మూడు నాలుగుసార్లు అలుగుపారాయి.

సూరారం వంతెన వద్ద తాత్కాలిక రోడ్డు


సూరారం-చందంపేట వంతెన వద్ద తాత్కాలిక రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టర్

చిన్నశంకరంపేట(మెదక్): భారీ వర్షాలతో చిన్నశంకరంపేట మండలం సూరారం-చందంపేట గ్రామాల మధ్య ఉన్న రహదారి వంతెన కొట్టుకుపోయింది. సూరారం రెడ్డిచెరువు ఇప్పటికి అలుగు పారుతుండడంతో సూరారం మధిర గ్రామాలైన పిట్టలగూడ, గిరిజనతండా ప్రజలు సూరారం గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. దీనికి తోడు మరో వారం రోజుల్లో వరి కోతలు కూడా మొదలు కానున్నాయని, గ్రామస్తులు కాంట్రాక్టర్‌కు వివరించారు. వెంటనే ఆయన తాత్కాలిక మట్టి రోడ్డును నిర్మించి రాకపోకలు సాగేలా చర్యలు చేపట్టారు.

మహబూబ్ కుటుంబానికి అండగా ఉంటాం


పరామర్శిస్తున్న పద్మారెడ్డి

పాపన్నపేటమెదక్): ఇటీవల ఏడుపాయల్లో జరిగిన ఘర్షణలో మరణించిన శేరి మహబూబ్ కుటుంబాన్ని గురువారం బీఆర్‌ఎస్ అధక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి పరామర్శించారు. బాధితుడి భార్య రేష్మా, పిల్లలకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మహబూబ్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట మండల పార్టీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఏడుపాయల మాజీ చైర్మన్ బాలాగౌడ్, సోములు, గ్రామ మాజీ సర్పంచ్ సంజీవ రెడ్డి, సాయివర్ధన్ గౌడ్, సామెల్, మాధవరెడ్డి ఉన్నారు.